ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 09.04.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వివిధ పంటలకు రుణ పరిమితి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక కమిటి బ్యాంకర్లకు సిఫారసు చేసింది.
2. ఢిల్లీ మద్యం కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీని న్యాయస్థానం మరో 14 రోజులు పొడిగించింది.
3. క్రోధినామ సంవత్సర ఉగాది పర్వ దినాన్ని ఈరోజు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆనందోత్సాహలతో జరుపుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో పంచాంగ శ్రవణాలు , కవి పండిత సత్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు..
4. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈరోజు నుంచి మూడు రోజుల పాటు ఒక మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

రుణ పరిమితి

వివిధ పంటలకు రుణ పరిమితి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సాంకేతిక కమిటి బ్యాంకర్లకు సిఫారసు చేసింది. ఎకరం వరికి ఇకపై 42 నుంచి 45 వేల రూపాయల వరకు పంట రుణం ఇవ్వాలని కమిటి సిఫారసు చేసింది. పత్తికి 44 నుంచి 46 వేలు ,మొక్కజన్నకు 32 నుంచి 34 వేలు , పసుపుకు 87 వేల రూపాయల వరకు రుణాలు ఇవ్వాలని నిర్దేశించింది. ఆయిల్ పామ్ కు 42 నుంచి 44 వేల వరకు , మిర్చికి 80 నుంచి 84 వేల రూపాయల వరకు , టమాటకు 50 నుంచి 55 రూపాయల వరకు రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు సూచించింది. అలాగే గొర్రెలు , మేకల యూనిట్లకు కూడా రుణ పరిమితి పెంచాలని సూచించింది.

డెస్క్

కవిత

ఢిల్లీ మద్యం కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీని న్యాయస్థానం మరో 14 రోజులు పొడిగించింది. తీహార్ జైల్లో ఉన్న కవిత జ్యుడిషియల్ కస్టడి ఈరోజుతో ముగియడంతో ఈడి అధికారులు ఆమెను సిబిఐ కోర్టులో హాజరుపరిచారు. కవిత బయట ఉంటే కేసు దర్యాప్తు ప్రభావితం అవుతుందని ఈడీ వాదనలు వినిపించింది. దీంతో కవిత జ్యుడిషియల్ కస్టడీని ఈనెల 23 వరకు పొ డిగిస్తూ సిబిఐ కోర్టు తీర్పునిచ్చింది. కవిత కోర్టులో నేరుగా మాట్లాడేందుకు అనుమతి కోరగా న్యాయమూర్తి నిరాకరించారు. కాగా , కోర్టులో భర్తను , మామను కలిసేందుకు కవితను అనుమతించాలని న్యాయవాదులు దరఖాస్తు చేయగా కోర్టు అనుమతించింది.

డెస్క్

ఐపీఎస్

సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ రతన్ ఈరోజు గుండెపోటుతో మృతి చెందారు . 1991వ ఐపీఎస్ బ్యాచ్కు చెందిన రాజీవ్ రతన్ ప్రస్తుతం తెలంగాణ విజిలెన్స్ డీజీగా పని చేస్తున్నారు . గతంలో ఆయన కరీంనగర్ ఎస్పీగా పని చేశారు . అలాగే ఆపరేషన్ ఐజీగా , పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్గా కూడా పని చేశారు . రాజీవ్ రతన్ ఆకస్మిక మృతి పట్ల గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖకు రాజీవ్ రతన్ అంకిత భావంతో సేవలందించారని గవర్నర్ తమ సందేశంలో పేర్కొన్నారు. రాజీవ్ రతన్ పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు . ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సమర్థవంతంగా పని చేసిన అధికారులను తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు.

(DESK)

కామారెడ్డి

ఎన్నికల కోడ్ ఉల్లంఘున జరిగినట్టు దృష్టికి వస్తే ప్రజలు సి విజిల్ యాప్ ద్వారా పిర్యాధు చేయవచ్చని కామారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘునలకు సంబంధించి ఫోటోలు లేదా వీడియోలను ఈ యాప్ లో అప్ లోడ్ చేయవచ్చని పిర్యాధులు అందిన వంద నిమిషాల్లో స్పందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సి విజిల్ కు ఇప్పటి వరకు అందిన 15 పిర్యాధులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్నామని చెప్పారు.

పిటిసి, కామారెడ్డి

ఎన్నికల కోడ్

సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ గౌడ్, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బిజెపి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడన్న ఆరోపణ పై తెలంగాణా సివిల్ సర్వీస్ రూల్స్ ప్రకారం ఆయనను సస్పెండ్ చేశారు. ఉద్యోగులందరూ ఎన్నికల నియమాలకు లోబడి పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. కాగా, జిల్లా లోని కోహీర్ మండలం గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మణాచారిని పంచాయతీ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

(PTC)

ఉగాది

క్రోధినామ సంవత్సర ఉగాది పర్వ దినాన్ని ఈరోజు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. పల్లెలు , పట్టణాలు పండగ శోభను సంతరించుకున్నాయి. కొత్త సంవత్సరంలో శాంతి, సౌక్యాలు కలగాలని కోరుకుంటూ ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో తిరుమల , శ్రీశైలం, తెలంగాణలో వేములవాడ, భద్రాచలం మొదలైన పుణ్య క్షేత్రాలు ఉగాది ఆస్థానాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో పంచాంగ శ్రవణాలు , కవి పండిత సత్కారాలు , సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. జంట నగరాల్లో ప్రజలు

ఉగాది పండగను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. ఉదయం పది గంటల వరకు కూడా ఉగాది పచ్చడికి ఉపయోగించే వేప పువ్వు , మామిడికాయలు, చెరకు, పళ్లు కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా కనిపించాయి. ఉగాది పర్వదిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ కార్యాలయం గాంధీభవన్ లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర నాయకులు హాజరయ్యారు. వేద పండితులు శ్రీనివాస మూర్తి పంచాంగ శ్రవణం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు , కేంద్ర మంత్రి పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిషన్ రెడ్డి క్రోధినామ సంవత్సరం చాలా ప్రాధాన్యత కలిగిన సంవత్సరమని ఈ ఏడాదే పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయని అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రజలకు మరింత సేవలందించే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు. బిఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్ లో కూడా ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ముంచిత్తల్ లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొని తెలుగు ప్రజలందరికి శ్రీ క్రోధిమాన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం ధన్వాడ గ్రామంలోని దత్తాత్రేయ స్వామి దేవాలయంలో మంత్రి శ్రీధర్ బాబు ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు . అభివృద్ధి, సంక్షేమ విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తామని శ్రీధర్ బాబు చెప్పారు.
ఉగాది పండుగ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది . సిరిసిల్ల, వేములవాడ పట్టణాలలో కవి సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో పంచాంగ

శ్రవణం నిర్వహించారు. వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామిని ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
వరంగల్ భద్రకాళీ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. విశ్వహిందూ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణి చేశారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రముఖ సిద్దాంతి ఓరుగంటి మనోహర్ శర్మ రచించిన పంచాంగాన్ని ఆవిష్కరించారు. ప్రజలు ఆవేశంతో , తొందరపాటుతో నిర్ణయాలు తీసుకోకుండా ఆలోచించి అడుగులు వేయాలని ఆయన కోరారు. జనగామ జిల్లాలో కూడా ప్రముఖ ఆలయాల్లో పంచాంగ శ్రవణానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.
డెస్క్/పిటిసి
మెట్రో
ఈ ఉగాది నుంచి మెట్రో రైలు ప్రయాణికులకు 3 కొత్త ఆఫర్లను అందిస్తున్నామని మెట్రో మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డ్, మెట్రో స్టూడెంట్ పాస్, సూపర్ ఆఫ్ పీక్ అవర్ ఆఫర్లను మెట్రో ప్రయాణికులు నేటి నుంచి వినియోగించు కోవచ్చని తెలిపారు. ఈ 3 ఆఫర్లు 6 నెలల పాటు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు . మెట్రో ప్రయాణికుల కోసం ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ సరికొత్తగా కస్టమర్ లాయల్టీ ప్రోగ్రాంను పరిచయం చేస్తోందని , ఎక్కువగా మెట్రో సేవలు వినియోగించుకుంటే ఎక్కువ రివార్డులు పొందవచ్చని చెప్పారు.
(PN)
వర్షాలు
తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఈరోజు నుంచి మూడు రోజుల పాటు ఒక మోస్తరు తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని చోట్ల గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదుగాలులు వీచే అవకాశం ఉందని కూడా వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ , ఆగ్నేయ దిశల నుంచి కింది ఉపరితల గాలులు కారణంగా భద్రాద్రీ

కొత్తగూడెం, సూర్యాపేట , నల్గొండ, జోగులాంబ గద్వాల , జనగామ, యాదాద్రి భువనగిరి , సిద్దిపేట, మంచిర్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈరోజు వడగాల్పులు వీస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నిన్న రాష్ట్రంలో 44 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత సూర్యాపేట జిల్లాలో నమోదైంది.

డెస్క్

ధాన్యం కొనుగోలు

సంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాలలో రోజంతా పనిచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. గ్రేడ్ ఏ రకానికి 2 వేల 203, గ్రేడ్ బీ రకానికి 2 వేల 183 రూపాయలు చెల్లిస్తారు. ఇప్పటికే 143 కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోకుండా పగడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.

(PTC)